క్లుప్తంగా

బాలలతో పని చేయించడం నేరం

వీరవాసరం : బాలలను వ్యాపారాల దగ్గర, షాపుల వద్ద పనులు చేయించడం నేరమని భీమవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్ -1 ఎస్ దుర్గారావు తెలిపారు. వీరవాసరం మండలంలోని నవుడూరు, రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి గ్రామాల్లో బుధవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. షాపులను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్కిల్ 2 ఆఫీసర్ మల్లేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళా పోలీసులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఆకివీడు: మండల పరిషత్ అధ్యక్షురాలు కఠారి జయలక్ష్మి అధ్యక్షతన ఆకివీడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కందుల వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై సమావేశంలో సమీక్షిస్తారని, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

వీరవాసరం ఎంఈవో-2గా శ్రీమన్నారాయణ

వీరవాసరం : వీరవాసరం మండల విద్యాశాఖ అధికారి-2గా ఎంఎస్ శ్రీమన్నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన రాజీవ్ విద్య మిషన్‌లో ఎస్ఎస్ఎలో ఏఎమ్ఓగాను, ఐఈ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మండలంలోని ఉపాధ్యాయులు సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఆర్పీ సిబ్బంది ఎంఈఓను కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మండలంలోని విద్యాశాఖ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు.

ఎంఈఓ-2గా సుధారాణి బాధ్యతల స్వీకరణ

పాలకోడేరు: మండల విద్యాశాఖాధికారి-2గా ఎ.సుధారాణి నియమితు లయ్యారు. బుధవారం ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు బి.పాండురంగారావు, కేవీ సుబ్బరాజు, బిఎస్ శ్రీనివాస్ తదితరులు సుధారాణికి అభినందనలు తెలిపారు.

తుందుర్రు మాజీ సర్పంచ్ కొట్టు బాబులు మృతి


బాబులు భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న కొయ్యే మోషేన్ రాజు

భీమవరం అర్బన్ : తుందుర్రు గ్రామ మాజీ సర్పంచ్ కొట్టు సత్యనారాయణ (బాబులు) (60) బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. కొట్టు బాబులు మాజీ సర్పంచ్‌గా, మాజీ ఎంపీటీసీగా, మావుళ్లమ్మ దేవస్థానం ట్రస్ట్ మాజీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంతో పాటు మావుళ్లమ్మ దేవస్థానం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. కొట్టు బాబులు భౌతికకాయానికి రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


భీమవరంలో యోగాసనాలు వేస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు


మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


ఆకివీడులోని మాదివాడ శాఖా గ్రంథాలయంలో యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

ఉత్సాహంగా యోగా దినోత్సవం

భీమవరం అర్బన్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ రోజుకు గంట పాటు యోగాసనాలు వేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో బుధవారం అమృత్ సరోవర్ చెరువు వద్ద ఉపాధి హామీ పథక వేతన దారులు, సిబ్బంది, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డ్వామ పీడీ ఎస్‌టీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగాతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. యోగాసనాలలో భాగమైన ధ్యానం, ప్రాణయామం వేస్తే ఆరోగ్యవంతులవుతారన్నారు. సూర్య నమస్కారాలలో 12 భంగిమలు ఉంటాయని అవి వేస్తే ఎముకలు, కండరాలు బలోపేతమై ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మధుమేహం, బీపీ, గుండె జబ్బులు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వి.విజయలక్ష్మి, సర్పంచ్ చిల్లే వెంకటేశ్వర్లు, కార్యదర్శి కె.భవానీ, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్, టీఏ చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

సాక్షి, భీమవరం : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలోని పలు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యోగాసనాలు, ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు వేయించిడమే గాక యోగా ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగ రాజు, ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురువు బొండాడ బాబురాజేంద్రప్రసాద్‌ను సత్కరించారు. వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురువు పులపర్తి గోపాల్, ప్రిన్సిపాల్ ఎవీ రమణ పాల్గొన్నారు.

సీఎస్ఎన్ కళాశాలలో యోగా సెంటర్ ప్రారంభం

పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాలలో బుధవారం యోగా సెంటర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యుడు రమణారావు, కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కె నందకిషోర్, ఇన్‌చార్జ్‌ప్రిన్సిపాల్ కె సురేష్‌బాబు, పి భవాని, పి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో యోగాసనాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, పి.రాజశేఖర్, ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు


గొల్లవానితిప్పలో అమృత్ సరోవర్ చెరువు వద్ద యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కోర్టు ఆవరణలో...

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భీమవరం మూడవ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్యాత్మిక గురువు కె.గోపాల స్వామి పర్యవేక్షణలో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి, సంపూర్ణ ఆరోగ్యం, వృత్తినైపుణ్యం, ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవచ్చునన్నారు. జడ్జి శ్రీసత్యాదేవి మాట్లాడుతూ నిత్యం యోగా, ప్రాణాయామం చేయడం అలవర్చుకుంటే మంచి ఆరోగ్యాన్ని, శారీరక దారుఢ్యం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్‌కుమార్, జి.సురేశ్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మొగ్గ వెంకట రమణారావు, పి.రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

200 మందితో యోగ

భీమవరం(ప్రకాశం చౌక్) : అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్దరాజు అనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో ఆనంద ఫంక్షన్ హాల్లో 200 మందితో యోగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత పొందుతారని అన్నారు. ఆనంద చైర్మన్ యూకే విశ్వనాథ రాజు మాట్లాడుతూ త్వరలో ప్రత్యేకంగా యోగ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చెప్పారు. అనంతరం ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు యోగాపై శిక్షణ నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి, ఉద్దరాజు కృష్ణంరాజు, కంతేటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా

ఆకివీడు: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని ప్రిన్సిపాల్ కే.సుజాత అన్నారు. దుంపగడపలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యోగా మాస్టార్ మోటుపల్లి సతీష్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకృతి, ఆయుర్వేద, మూలికా వైద్యంతో పాటు యోగాసనాలు పలు రోగాల్ని, వ్యాధుల్ని, వైరస్‌లను దూరం చేయగల సత్తా ఉందని చెప్పారు. అలాగే మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు యోగాసనాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు తహాసిన్, గాయత్రీ, హర్షలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్ని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, అడ్వకేట్ నెల్లి సతీష్‌కుమార్, బచ్చు శ్రీనివాస్, రీడర్స్‌ఫోరం అధ్యక్షులు డీవీ.సత్యనారాయణ, లోవరాజు తదితరులు బహుమతులు అందజేశారు. గ్రంథ పాలకురాలు పార్వతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ పైనాన్స్ భీమవరం వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ పెన్మెట్స ఆంజనేయులు తండ్రి నరసింహమూర్తి కొనుగోలు చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియచేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. భీమవరం సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.2101/2017, ఆర్.యస్.నెం.74/1, భీమవరం మండలం కొమరాడకు చెందిన 198-2-00 చ.గ. స్థలానికి హద్దులు తూర్పు : బోదె, పడమర : వేగేశ్న రామ సుబ్బలక్ష్మి స్థలం, దక్షిణం : కటికల సత్యనారాయణ స్థలం, ఉత్తరం : గొర్తి శ్రీరామమూర్తి భూమి.

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేటు, పాలకొల్లు, సెల్ : 94904 38782

యోగాతో మెరుగైన ఆరోగ్యం

ఉండి: ప్రతిరోజూ యోగాసనాలు వేయడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని మహదేవపట్నం హైస్కూల్ హెచ్ఎం ఎస్.రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైస్కూల్ విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసిన ఘనత మన దేశానికే దక్కుతుందన్నారు. దాని ప్రాముఖ్యతను గమనించిన ప్రపంచ దేశాల ప్రజలు ప్రతిరోజు యోగా చేసి మంచి ఫలితాలు పొందుతున్నారన్నారు. యోగా ద్వారా మనలో ఉండే అనారోగ్య సమస్యలు తొలగి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. పీడీ జీవీ కృష్ణంరాజు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. చేతికీ చూపుకీ మధ్య సమన్వయం పెరుగుతుందన్నారు. వృద్ధాప్యంలో సంభవించే కీళ్ల సమస్యలు వంటి అనారోగ్య సమస్యలు దరికిరావన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీ.దర్మతేజ్, డాక్టర్ బీ సాయిచంద్ర పాల్గొన్నారు.

ముద్రగడపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ఆకివీడు: ఓవర్ యాక్షన్ తప్ప రాజకీయాల్లో ఓనమాలు తెలియవని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై కాపునాడు నియోజకవర్గ నాయకుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య విమర్శించారు. కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభంపై వారాహి యాత్రలో పవన్ చేసిన ఆరోపణలపై ఆయన ధ్వజమెత్తారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పవన్ రాజకీయ పరిణితి లేని నాయకుడుగా వారాహి యాత్రలో స్పష్టమవుతోందన్నారు. ప్రజల్లో తిరుగుతూ ప్రజా నాయకుడుగా ఎదగాలే తప్ప కించపరిచే మాటలతో కాలక్షేపం చేస్తే చరిత్ర ఉండదని హెచ్చరించారు. మహానేత వైఎస్సార్ పాదయాత్రలో ఎంతో హుందాగా ప్రవర్తించారని, అదే రీతిలో పాదయాత్ర చేసిన ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిణతి చెందిన రాజకీయవేత్తగా వ్యవహరించి, ప్రజామన్నన పొందారన్నారు. తొడలు కొట్టి, నోటికి వచ్చిన మాటలాడితే ఓట్లు రాలవన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అందే రాజబాబు, కేశిరెడ్డి దుర్గారావు, కఠ్రెడ్డి సత్యనారాయణ, నూకల సత్యనారాయణ, నంద్యాల భద్రం, పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైవేపై ఆక్రమణల తొలగింపు


జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం


వృద్ధురాల్ని ఓదారుస్తున్న వైఎస్సార్ సీపీ నేత పాలు

ఆకివీడు: జాతీయ రహదారి నంబర్ 165లో ఉప్పుటేరు వద్ద రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలను ఆ శాఖ డీఈ శ్రీనివాసరావు, జేఈ సచేరాల ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. కొన్ని నెలల క్రితం కోర్టు ఆదేశాలతో ఆక్రమణలను ఖాళీ చేయాలంటూ పలుమార్లు చెప్పినప్పటికీ స్పందించకపోవడంతో పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగిస్తున్నామని డీఈ శ్రీనివాస్ విలేకరులకు చెప్పారు. దశాబ్దాలుగా రోడ్డు మార్జిన్‌లో పూరి గుడెసెలు వేసుకుని నివాసం ఉంటున్న తమకు ప్రత్యామ్నాయంగా ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా తమ ఇళ్లను కూల్చివేయడంపై నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్లు ఖాళీ చేసేందుకు మరికొంత గడువు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ బొర్రా నాగబాబు, టీడీపీ నాయకుడు పిన్నమరాజు శ్రీనివాసరాజు, జనసేన నాయకులు అధికారులను కోరారు. గతంలో పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన వారికి పట్టాలు ఇస్తామని, వ్యాపారస్తులు తక్షణం ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ ఎస్వీ విజయలక్ష్మీ , ఎన్‌హెచ్ అధికారులు పట్టుబట్టారు. బాధిత పేర్లను సేకరించి వారికి హామీ ఇవ్వడంతో ఇళ్లను ఖాళీ చేశారు. గడువు కోసం నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో జేసీబీతో వారి ఇళ్లను, వ్యాపారషెడ్లను తొలగించారు. బాధితుల్లో నడవలేని 80 ఏళ్ల వృద్ధురాలి ఇల్లు ఉండటంతో ఆమెతోపాటు మూడు మరో మూడిళ్లను స్వచ్ఛందంగా తొలగించుకునేలా వారికి సోమవారం వరకు అధికారులు గడువు ఇచ్చారు.

ఉపాధ్యాయులకు సత్కారం

కాళ్ల: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు పూజ్యనీయులని ఎంఈఓ-1 ఎ.రవీంద్ర అన్నారు. జువ్వలపాలెంలోని ఎంపీపీ, హైస్కూల్‌లో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు ఎంవీ త్రినాథులు, కే.శర్మ, బి.సునీత, వి.రవీంద్ర కుమార్, బీఆర్‌కే స్వామి, పీవీ వరలక్ష్మి, ఏం.వర్మలను బుధవారం సత్కరించారు. ఎంఈఓ-2 గాదిరాజు కనకరాజు, నాయకులు రుద్రరాజు కృష్ణంరాజు, ఉప సర్పంచ్ కటారి లక్ష్మీపతిరాజు, గోకరాజు వినోద్‌రాజు, ఎంపీటీసీ సభ్యులు ఎం.శ్రీనివాస్, గుర్రం జార్జ్ బెనహర్ ఉపాధ్యాయ సేవలను ప్రశంసించారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పశుబీమాతో పాడిరైతుకు భరోసా

భీమవరం అర్బన్ : పాడి రైతులు నష్టపోకుండా ఉండేందుకే వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ మురళీ కృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకంపై పశు పెంపకం దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలు వ్యాధులతో గాని, ప్రమాదం వల్లగాని మృతి చెందితే వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందవచ్చన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న పశు పెంపకం దారులకు 80 శాతం, లేని వారికి 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. బీమా ఇన్స్యూరెన్స్ చేసిన పశువుకు చెవిపోగు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఒకవేళ చెవిపోగు పడిపోతే పశు సంవర్థక శాఖ సిబ్బందికి తెలియజేస్తే 24 గంటలలో ఆన్‌లైన్‌లో నమోదు చేసి చెవిపోగు ఇస్తారన్నారు. పశు పెంపకం దారులు పశువు విలువను బట్టి ప్రీమియం చెల్లించి 3 సంవత్సరాల వరకు ఇన్స్యూరెన్స్ పొందవచ్చన్నారు. అనంతరం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ జావర్ హుస్సేన్, ఏడీ సుధీర్‌బాబు, నేషనల్ ఇన్స్యూరెన్స్ భీమవరం శాఖ మేనేజర్ నాగేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు, లలిత కుమారి, సుమ, పశు సంవర్థక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

భీమవరం అర్బన్ : ఈ ఏడాది సార్వా సాగుకు సంబంధించి కౌలు రైతులు కౌలు రైతు గుర్తింపు కార్డు (సీసీఆర్‌సీ)లకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుర్తింపు కార్డుల వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, ధాన్యం విక్రయం తదితర ప్రభుత్వం ఇచ్చే వివిధ పథకాలను పొంది ప్రయోజనం పొందవచ్చన్నారు. వివరాలకు కౌలు రైతులు వ్యవసాయ కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు.

విధులకు ఆటంకంపై కేసు నమోదు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కమిషనర్ విధులకు ఆటంకం కలిగించిన ఘటనపై కమిషనర్ జీ.కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.రాజరెడ్డి చెప్పారు. స్థానిక అందేవారి బోదె ఆక్రమణల్ని తక్షణం తొలగించాలని, బోదెలో సిల్టు తక్షణం తొలగించాలని స్థానికులు జానకీ సుమంత్, బత్తుల రవీంద్రబాబు, మరికొంతమంది కమిషనర్ విధులకు ఆటంకం కలిగించారని, కార్యాలయం ఎదుట ధర్నా చేశారని ఆయన ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై ధర్నా చేస్తున్న సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, రేపు సిల్టు తీయిస్తామని, ఆక్రమణలను జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకువెళతామని చెప్పనప్పటికీ సహకరించలేదు. దీంతో కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తికి రిమాండ్

సాక్షి, భీమవరం : భీమవరం మండలం అనాకోడేరు గ్రామంలో వేమన దుర్గారావును 11 మద్యం సీసాలతో అరెస్టు చేసి భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ బుధవారం విలేకర్లకు చెప్పారు. నిందితుడు దుర్గారావును భీమవరం 1వ ఏజేఎఫ్సీయం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. దాడుల్లో ఎస్సైలు జి.సునీల్ కుమార్, బి.రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది శ్రీనివాసరావు, డేవిడ్ రాజు, గణేశ్ పాల్గొన్నారు.